# లక్ష్యసాధన

ఉభయభాషా ప్రవీణ విద్వత్ కవయిత్రి డా॥ ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మగారి శతజయంతి ఉత్సవానికి విచ్చేసి కళాపీఠం ప్రతిష్ఠను మరింత ఇనుమడింపజేసిన మహామహులు, మేధావులు సాహితీవేత్తలు సాహితీప్రియులకు సంస్థ తరపున గౌరవాభివందనాలు సమర్పించుకొంటున్నాను.

40 సంవత్సరాల నా సాహితీ ప్రస్థానంలో సాంస్కృతీ సమాఖ్య శ్రీనాళం కృష్ణారావు కళాపీఠం, తెలుగుభాషా చైతన్యసమితి, కళాభారతి వంటి సంస్థలలో అధ్యక్ష కార్యదర్శివంటి కీలక పదవులనలంకరించి తెలుగు భాషా సాహిత్య సామాజిక సాంస్కృతిక కార్యక్రమాలను స్వచ్ఛందంగా నిర్వహిస్తున్న నేను గత ముప్పై సంవత్సరాలుగా ఉభయభాషా ప్రవీణ, కళాప్రపూర్ణ స్వర్ణాభిషిక్త, స్వర్ణకంకణగ్రహీత ఆదిగా గల బిరుదుల హారాన్ని ధరించి సామాజిక స్వాతంత్ర్యోద్యమ సేవలలో తరించిన విదుషీమణి డా॥ ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మగారి పేరుమీద కళాపీఠాన్ని స్థాపించి పైన పేర్కొన్న కార్యక్రమాలతో బాటు ప్రతి సంవత్సరం డిశెంబరు 21వ తేదీన ఆమె జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని సాహిత్య సామాజిక సేవలలో ప్రఖ్యాతి గాంచిన ఒక మహిళామణికి లక్ష్మీకాన్తమ్మగారి పేరుమీద నగదు, జ్ఞాపిక, శాలువ సత్కారంతో బాటు పురస్కారం అందజేయడం జరుగుచున్నది.

లక్ష్మీకాన్తమ్మ గారు విదేశీయుల ఆహ్వానంపై జర్మని, జపాన్ టొరంటొ మొదలగు దేశాలలో పర్యటించి అక్కడి ప్రజలలో మన తెలుగు భాషాసంస్కృతులను ప్రచారం గావించిన మహామనీషి. ఆంధ్రకవయిత్రులు, అఖిల భారత రచయిత్రులు, జాతిపిత, సదుక్తిమంజరి, కాంతి శిఖరాలు, కన్యకమ్మనివాళి, సరస్వతీ సామ్రాజ్యవైభవంవంటివి, సాహితీరుద్రమ జీవితచరిత్రను రచించి వినుతికెక్కిన విదుషీమణి డా॥ లక్ష్మీకాన్తమ్మగారు.

రాష్ట్ర, కేంద్ర సాహిత్య అకాడమీలలోను, విశ్వహిందూపరిషత్తు, ఆర్యవైశ్యసంఘం వంటి సంస్థలలో కీలకమైన పదవులను అది సమర్థవంతంగా నిర్వహించుటేగాక బాపట్లలోని స్త్రీ హితైషిణిమండలి అధ్యక్షురాలిగా మహిళలకు విద్య, వృత్తి, ఉపాధి వంటి సేవలెన్నింటినో అందించారు. తన పదమూడవ ఏటనే స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని కీలక పాత్రను పోషించారు. ముఖ్యంగా ఆమె మహిళోద్యమ స్ఫూర్తి ప్రశంసనీయమైనది. అభ్యుదయపథంలో స్త్రీ అభ్యున్నతిని కాంక్షించి స్త్రీహితైషిణి మండలి, శారదానికేతన్ వంటి సామాజిక విజ్ఞాన సమితులను స్థాపించి మహిళాభ్యుదయపదంలోను, సంఘసేవలోను విశేషంగా పాల్గొని తరించారు. అనేకసేవాసంస్థలకు, బీదవిద్యార్థులకు, దేవాలయాలకు విరివిగా విరాళాలిచ్చేవారు. వీరి ఆధ్వర్యంలోని మహిళాభ్యుదయసంస్థలు రాష్ట్రవ్యాప్తంగా మెరుగులు దిద్దుకొని అభివృద్ధిపదంలో పయనించేవి.

వీరి ఉపన్యాసం అనర్గళం - వీరి మహిళాభ్యుదయ ఉపన్యాసాలకు ఆంధ్రదేశం అన్ని దిశలనుండి ఆహ్వానాలు వచ్చేవి. పన్నెండు సంవత్సరాల వయసులోనే లక్ష్మీకాన్తమ్మగారు పికెటింగులకు వెళ్ళడం, ఖాదీ వస్త్రాలు అమ్మడం, విదేశీ వస్త్రాలు తగులబెట్టడం వంటి సత్యాగ్రహోద్యమ కార్యక్రమాలలో పాల్గొనేవారు. వీరి "ఆంధ్రకవయిత్రులు" రచయిత్రులు" గ్రంథరచనకు మూడు సంవత్సరాలు కష్టపడి వివిధ రాష్ట్రాలు పర్యటించి వివిధ భాషల వారి ద్వారా 264 మంది రచయిత్రులను వెలుగులోనికి తెచ్చారు. లక్ష్మీకాన్తమ్మగారు తమ "అఖిలభారత చిరునామాలను సేకరించి విజయం సాధించారు. తద్వారా అఖిల భారత స్థాయిలో కేంద్రప్రభుత్వం వారి ఆర్థికసహాయంతో శ్రీమతి కాసు రాఘవమ్మగారు ఆహ్వాన సంఘాధ్యక్షులుగను ప్రసిద్ధ సినీనటి రచయిత్రి శ్రీమతి భానుమతి అధ్యక్షతన, శ్రీమతి విజయలక్ష్మీ పండిట్ ముఖ్యఅతిధిగా విచ్చేయగా ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారి ఆధ్వర్యంలో వరుసగా ఏడురోజులపాటు అఖిలభారతస్థాయిలో అత్యంత వైభవంగా రచయిత్రుల మహాసభలు జరిపించారు.

లక్ష్మీకాన్తమ్మగారి సామాజిక సేవలకు నిదర్శనంగా ఒక సంఘటన, ఆమె ఎనిమిది మాసాల గర్భిణిగా ఉన్న సమయంలో అమరావతిలో 'గోవధ' జరుగుచున్నదని విని ఇంట్లోవారు ఎంత వాదించినా వివకుండా కార్యకర్తలు తెచ్చిన కారులో అమరావతికి వెళ్ళారు. వధ్యశిల ముందు నిలబడి ముందు నాతలనరికి తదుపరి గోవును వధించమని చెప్పగానే అందరూ ఆశ్చర్యచకితులై ఆమెను వెనక్కుతెచ్చారు. ఆవిధంగా అప్పటి గోవధను ఆపగలిగారు లక్ష్మీకాన్తమ్మగారు.

20వ శతాబ్దంలో గజాధిరోహణం, కనకాభిషేకాది సమ్మానాలను, కళాప్రపూర్ణ గౌరవాన్ని పొందిన ఏకైక మహిళ ఆమె. గలగల పారే గంగా ప్రవాహంతో సమానమైన ఆమె గంభీరవాణి దేశవిదేశాలలోనూ మారుమ్రోగింది. 1996 డిశెంబరు మాసంలో ఒకటవ తేదీన ఆమె పరమపదించారు.

అంతటి గొప్ప వ్యక్తిత్వం సంతరించుకొన్న పుణ్యమూర్తి. నాకు సాహితీగురువులైన డా॥ ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మగారి ఔన్నత్యాన్ని సాహితీ సౌరభాలను మరుగున పడనీయక వెలుగులోనికి తెచ్చి సాహితీ ప్రపంచంలో వ్యాప్తిచేయాలనే లక్ష్యసాధనతో డా॥ ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ కళాపీఠాన్ని స్థాపించి నాటి నుండి నేటి వరకు తెలుగు భాషా సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ గావిస్తున్నాను.

ఈ సంవత్సరం అనగా 2017, డిసెంబరు 21వ తేదీన ఆమె శతజయంతి. ఈ సందర్భంగా ది. 24-12-2017వ తేదీన ఆదివారం ఉదయం 9గం. ల నుండి సాయంకాలం వరకు ఘనంగా విజయవాడ హోటల్ ఐలాపురం నందు శతజయంతి వేడుకలు నిర్వహించాము.

లక్ష్మీకాన్తమ్మగారి శతజయంతి సందర్భంగా కొందరు వదాన్యులు ఎంతో ఔదార్యంతో తమ సహాయ సహకారాలను అందించారు. వారందరికి నాకృతజ్ఞతాభివందనాలు సమర్పించుకొంటున్నాను. నాకు సహకరించిన ప్రాంతీయ కార్యకర్తలు, సమన్వయకర్తలు అందరకు నా ధన్యవాదములు.

"సర్వేజనాసుఖినోభవంతు"

కోకా విమలకుమారి